క్లుప్తంగా

రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, ఫలక్‌నామాలకు వెళ్ళే ఎంఎంటీఎస్ రైళ్ల వేళలు ఇలా వున్నాయి.

- నాంపల్లి వైపు వెళ్ళే ఎంఎంటీఎస్ రైళ్ళు: ఉదయం: 6:40, 7:40, 8:10, 9:15, 10:15,11:10, 11:55
- మధ్యాహ్నం: 12:50 , 13:20 , 14:25, 15:20
- సాయంత్రం: 16:10, 17:55
- రాత్రి : 18:55, 20:05, 21:25
- సికింద్రాబాద్ వరకు: రాత్రి 22:50, 23:25
- ఫలక్‌నామా వైపు వెళ్ళే రైళ్ళు: ఉదయం: 5:50, 6:30, 6:50 ,8:25, 9:05, 9:31,10:05, 11:20,11:40.
- మధ్యాహ్నం: 12:40, 13:25, 14:40, 14:55 , 15:10
- సాయంత్రం: 16:35, 17:10, 17:30, 18:00,18:35
- రాత్రి: 19:10, 19:55, 21:00, 21.15, 21:45.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 14 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్లు నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 11 మందికి ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

నేటి నుంచి బీజీసీఐ-2023 అంతర్జాతీయ సమావేశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బోర్డ్ ఆఫ్ జెనెటిక్స్ కౌన్సెలింగ్ ఇండియా (బీజీసీఐ)-2023 అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బీజీసీఐ సంయుక్తంగా 8వ వార్షిక అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను జూలై 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో పరిశోధకులు, జన్యు సలహాదారులు, నిపుణులు, వైద్యులు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు, పరిశ్రమలు, జన్యుశాస్త్రం, జెనోమిక్స్‌లలో విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. 14 మంది అంతర్జాతీయ, 52 మంది జాతీయ నిపుణులు పాల్గొంటారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కళాజ్యోతి, రాజప్రసాదం పరిసరాలు, మసీద్‌బండ కల్లు కాంపౌండ్, మసీద్‌బండ క్రాస్ రోడ్డు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీరాంనగర్ ఏ బ్లాక్, బి బ్లాక్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

9న 'బాల బృందావనం'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం పిల్లల కోసం 'బాల బృందావనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, 9 -14 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లల కోసం 'బిల్డ్ యువర్ కాన్ఫిడెన్స్' పేరిట ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించ వచ్చని నిర్వాహకులు తెలిపారు.

కాలువలు కబ్జా చేస్తే చర్యలు తప్పవు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వరద కాలువలను కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ ఏఈ సంతోషిని తెలిపారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పెద్ద చెరువు వరదకాలువను జేసీబీతో తీయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెరువులు, కాలువల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మత్స్యశాఖ బలోపేతానికి ప్రభుత్వం కృషి

పటాన్‌చెరు టౌన్: మత్స్యశాఖ బలోపేతానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా మత్స్యశాఖ చైర్మన్ గున్నాల నర్సింలుతో పాటు డైరెక్టర్లను చిట్కుల్‌లో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటనలో ఫిష్ ఇన్ అనే సంస్థ వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డైరెక్టర్లు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్





ఇదా 'సర్వీస్'?



- రోడ్డు తవ్వుతున్నారు..వదిలేస్తున్నారు.
- చిన్నపాటి వర్షానికే బురదమయం

మధురానగర్ ప్రధాన రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డు పరిస్థితి ఇదీ.....

రాయదుర్గం: అది నానాక్‌రాంగూడ ఐటీ కారిడార్....ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్....ఔటర్‌రింగు రోడ్డు... రామానాయుడు స్టూడియోకే కాకుండా.....నానక్‌రాంగూడ, ఖాజాగూడ, సాయిఐశ్వర్య కాలనీ, సాయివైభవ్‌కాలనీ, ప్రశాంత్ హిల్స్‌కాలనీ తదితరప్రాంతాలకు వెళ్ళే ప్రధాన రోడ్డు. ఈ రోడ్డులో సైకిల్ ట్రాక్, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. మధురానగర్ ప్రధాన రోడ్డు పక్కన సర్వీస్‌రోడ్డంతా గుంతలు, బురదమయంగా మారడంతో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇది ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఆతర్వాత 4 గంటల నుంచి రాత్రి 8 గంటలవరకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తాయి. ఈ నేపథ్యంలో సర్వీస్ రోడ్డుపైకి వెళితే బురదలో ఇరుక్కుపోతామనే భయం నెలకొంది. ఇదిలావుండగా శుక్రవారం సంత కూడా ఈ సర్వీస్ రోడ్డుపైనే నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం ఈ రోడ్డు ఇలా తయారవడంతో స్థానికులు సంత నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.





సీసీ, బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని పలు కాలనీల్లో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం శేరిలిగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని విజయనగర్‌కాలనీ, హెచ్‌యంటి శాతవాహన నగర్, మహంకాళినగర్, పీజేఆర్‌నగర్, దత్తాత్రేయకాలనీ, మొగులమ్మ బస్తీల్లో 3 కోట్ల 48 లక్షల నిధులతో రోడ్లు వేయనున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా చర్యలు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నం.1 - 5 వరకు, 3వ ఫేజు ఎల్ఐజీ ఫ్లాట్స్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబురావుతో కలిసి గురువారం రూ.80లక్షల నిధులతో చేపట్టనున్న భూగర్భ వాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మంచినీరు, వరదనీరుకు సంబంధించిన ఇబ్బందులు ఎక్కడా కలగకుండా పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అందులో భాగంగానే భూగర్భ పైపులైన్లు నిర్మిస్తూ వస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, వాటర్ వర్క్ జీఎం ప్రభాకర్, డీజీఎం శంశీర్, మేనేజర్ వైష్ణవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నాయకులు పవన్‌కుమార్, పాతూరి గోపి, రంగమోహన్, నాగేశ్వరరావు, ధనలక్ష్మీ, తిరుపతి రావు, నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి, సత్తిబాబు, జాన్‌మోజెస్, దినేష్ నాయుడు పాల్గొన్నారు.

పెళ్లి కోసం ఐడీ నమోదు చేసి..సైబర్ వలలో చిక్కి..

రూ.3.73 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పెళ్లి కోసం ఆన్‌లైన్‌లో ఐడీని క్రియేట్ చేసి సైబర్ వలలో చిక్కి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మోసపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీ హోమ్స్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్‌లో పెళ్లి కోసమని ఓ సైట్‌లో తన వివరాలతో ఐడీని నమోదు చేసుకున్నాడు. ఈ క్రమంలో అతడి ఐడీకి యువతి నుంచి రిక్వెస్ట్ వచ్చింది. ఆ మెసేజ్‌కి యాక్సెప్ట్ చేసి యువతి చెప్పినట్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి టెలిగ్రామ్ ద్వారా చాటింగ్ చేశాడు. ఈ క్రమంలో జూన్ 14వ తేదీన యువతి ఉద్యోగికి ఫోన్ చేసింది. తన తల్లికి రోడ్డు ప్రమాదం జరిగిందని, అత్యవసరంగా రూ.3,73,000లు ఆన్‌లైన్‌లో పంపమని కోరింది. దీంతో అతను ఆమె అడిగిన విధంగా డబ్బులను పంపాడు. కాగా ఆ యువతిని కలుద్దామని ఉద్యోగి అడగడంతో యువతి నుంచి స్పందన లేదు. దీంతో ఆ ఉద్యోగి మోసపోయినట్టుగా గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని..

పార్ట్‌టైం జాబ్ ఆఫర్ అంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ.3లక్షలు పోగొట్టుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని జూన్ 13వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అనే మెసేజ్‌కి స్పందించింది. దీంతో ఆమె తన వివరాలను నమోదు చేసింది. గుర్తు తెలియని వ్యక్తి చెప్పినట్టుగా నగదు ఇన్వెస్ట్ చేసి ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. చివరికి తను పెట్టిన నగదు రూ.3లక్షలతో పాటు రెట్టింపు నగదు కోరడంతో గుర్తు తెలియని వ్యక్తి నుంచి స్పందన లేదు. దీంతో ఆ ఉద్యోగిని మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

హఫీజ్‌పేట్ : భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పాలవెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన నాగరాజుకు ఏడుగురు కొడుకులు, నలుగురు అమ్మాయిలు ఉన్నారు. మూడవ కూతురు శీతల్ (31)ను 5 సంవత్సరాల క్రితం బీదర్ భర్‌దార్‌పూర్‌కు చెందిన సుధాకర్‌కు రూ.50వేల నగదు, ఒక తులం బంగారం ఇచ్చి వివాహం జరిపించారు. వీరు చందానగర్‌లోని పాపిరెడ్డి కాలనీలో నివాసముంటున్నారు. ఇద్దరు పిల్లలు. కాగా రెండు సంవత్సరాల నుంచి భార్యపై సుధాకర్ అనుమానం పెంచుకున్నాడు. పక్కింటి వారితో మాట్లాడితే అనుమాన పడుతూ భార్యను కొట్టడం చేస్తుండేవాడు. దీంతో ఆమె తండ్రికి తెలుపగా పెద్ద మనుషులతో వచ్చి సుధాకర్‌ను మందలించి వెళ్ళాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10 గంటలకు శీతల్ పక్క ఇంట్లో ఉండడం చూసిన భర్త ఇంటికి తీసుకువచ్చి చితకబాది తనకు లక్ష రూపాయలు కట్నం తీసుకురావాలని తిట్టడంతో, భరించలేక ఆమె అర్ధరాత్రి ఉరివేసుకొంది. గురువారం తెల్లవారు జామున 5 గంటలకు పక్కంటి బంధువులు శీతల్ తండ్రికి ఆత్మహత్య విషయం తెలిపారు. వెంటనే నాగరాజు చందానగర్‌కు వచ్చి చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా డా.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

పటాన్‌చెరు టౌన్: ప్రపంచ దేశాలలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ఎలుగెత్తి చాటిన దేశ భక్తుడు జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాయికుమార్, సురేందర్‌గౌడ్, జోగు ధన్‌రాజ్, దీపక్ గౌడ్, షఫీ, షకీల్, రాము, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం ఆకస్మిక తనిఖీ



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్ వార్డు కార్యాలయంలో గురువారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు గురుచరణ్ దుబే, మల్లేష్ గుప్తా, అక్బర్ ఖాన్, నరేందర్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ అలీ వివరాల ప్రకారం.. పట్టణంలోని జీపీ కాలనీకి చెందిన రామ్ హర్ష(65) రెండు సంవత్సరాలుగా యూరిన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో జూన్ 25వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామ్‌హర్ష తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి అదృశ్యంపై అశోక్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ దుర్గయ్య వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం పోచారం గ్రామానికి చెందిన రాజు(32) ఈ నెల 3వతేదీ సాయంత్రం తన బైక్‌పై ఇంద్రేశం నుంచి పోచారం వస్తుండగా, మధ్యంమత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన అతడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనూ-అలయన్స్ ఫ్రాంకైస్ ఒప్పందం



రాయదుర్గం: మనూ- అలయన్స్ ఫ్రాన్కైస్ (ఏఎఫ్) హైదరాబాద్ మధ్య ఒప్పందం కుదిరింది. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్, లింగ్విస్టిక్స్ అండ్ ఇండాలజీ విద్యార్థులకు ఫ్రెంచ్ భాషను బోధించడానికి ఫ్యాకల్టీ సభ్యులను అందించేందుకు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మనూ స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్, లింగ్విస్టిక్స్ అండ్ ఇండాలజీ డీన్ ప్రొఫెసర్ అజీజ్‌బానో, హైదరాబాద్‌లోని అలయన్స్ ఫ్రాంకైస్‌లోని కోర్సు డైరెక్టర్ సంతకాలు చేశారు. అలయన్స్ ఫ్రాంకైస్ హైదరాబాద్ ఫ్రెంచ్ భాష బోధించడానికి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కేంద్రం. దీనికి దేశవ్యాప్తంగా 13 కేంద్రాలు ఉన్నాయి.

వైరల్ వ్యాధికారకాలను గుర్తించేందుకు 'పీసీఆర్'లో శిక్షణ

రాయదుర్గం: వైరల్ వ్యాధికారకాలను గుర్తించడానికి పీసీఆర్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మానవులు,జంతువులు, మొక్కల్లో పెరుగుతున్న వైరల్ వ్యాధుల నేపథ్యంలో అన్ని రంగాలకు అపారమైన నష్టం జరుగుతున్న విషయం తెలిసిందే. పాలీమరేస్ చైన్ రియాక్షన్(పీసీఆర్) వంటి మాలిక్యులర్ బయాలజీ టెక్నిక్‌ల ద్వారా వైరస్‌ను గుర్తించడం అనేది శిక్షణ అందించే విధానాలలో ఒకటి. సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సురేష్ చేసిన దరఖాస్తుకు ప్రతిస్పందనగా సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు పీసీఆర్‌లో హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ నిర్వహించేందుకు ఆర్థిక సహాయాన్ని ఆమోదించింది. విజ్ఞానాన్ని వేగవంతం చేయండి-కార్యశాల పథకం' పేరిట వర్క్‌షాప్ నిర్వహించాలని ఆదేశించింది. జూలై 24 నుంచి జూలై 30వ తేదీ వరకు హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తారు. గూగుల్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తు చేయడానికి జూలై 12 చివరితేదీ. మరిన్ని వివరాలకు sdc.sls.uoh@gmail.com కు ఈ మెయిల్ ద్వారా ప్రొఫెసర్ సురేష్ సంప్రదించవచ్చు.

'మనూ'లో డిస్టెన్స్‌లో బీఈడీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) ద్వారా డిప్లొమో ఇన్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన సర్వీస్ టీచర్ల కోసం బీఈడీ కోర్సుకు దూరవిద్య ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జూలై 25 చివరితేదీ. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. అవసరమైన పత్రాలు జతచేసి, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. అర్హత, ఇతర వివరాలకోసం యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలి.

జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శం



జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని షెడ్యూలు కులాలు, అణగారిన బడుగుబలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, సీనియర్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాస కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం జీహెచ్‌యంసి ఇంజనీరింగ్ అధికారులు, కాలనీవాసులతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈ గోవర్ధన్, ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు దామోదర్ రెడ్డి, పోతుల రాజేందర్, రమేష్, నవీన్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.



శ్రీనివాస కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



లబ్ధిదారు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్‌కు చెందిన రాజేశ్వరికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 2 లక్షల 50 వేల రూపాయల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, జనార్ధన్‌రెడ్డి, చాంద్ పాషా, కాశీనాథ్, కరీం, దీక్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్‌లో రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్, సాయినగర్, ప్రేమ్‌నగర్‌లకు చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జావెద్, నయామ్, మనోహర్, ఫయాజ్, రషీద్, ఆకాష్, కరణ్, జీవన్, విజయ్, సలాం, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.



'మనూ'ను సందర్శించిన ఫ్రాన్స్ బృందం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంను ఫ్రాన్స్ ఉన్నతస్థాయి బృందం గురువారం పరిశీలించింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నీటి నిర్వహణను ఈ బృందం పరిశీలించింది. అర్బన్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ఫ్రెంచ్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శిస్తోంది. అందులో భాగంగా మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో ఫ్రాన్స్ బృందం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ క్యాంపస్‌లో నీటి సంరక్షణ, నిర్వహణపై చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి వైస్‌చాన్స్‌లర్ వారికి వివరించారు. 'మనూ'లో నీటి నిర్వహణపై మనూ జల్‌శక్తి కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో ప్రొ.మహ్మద్ ఫరియాద్, ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, ప్రొఫెసర్ సల్మాన్ ,రాష్ట్ర భూగర్భ జల విభాగం డైరెక్టర్ డాక్టర్ పండిట్ మధుర్నే, సెంట్రల్ వాటర్ కమిషన్ సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్ బైరీ పాల్గొన్నారు.